


# సి.హెచ్.మధు అంకితం

కుంది. పదిహేను రోజులు ఇంట్లో వుంది. బయటకుపోయేది కాదు. సత్యం పడుకునే గది ఆమెకిచ్చాడు. ఈ పదిహేను రోజులు ఆమే వంట చేసింది. ఇంట్లో పనులన్నీ చేసింది, తనను కూడా బాగా ఆదరించింది. పనులు లేనప్పుడు బయటకి వచ్చేది కాదు బజారుకయితే ఆమె వచ్చిన నుంచీ పోలేదు. ఆమె ఎవరూ?— ఎందుకొచ్చింది ?— ఎందుకింట్లో వుంటుంది?— తనకేమీ అర్థం కాలేదు. కాని ఆమె గుణం, ఆమె నడవడి అన్నీ తనకు నచ్చాయి.

అకస్మాత్తుగా ఆమె ఎవరికీ చెప్పకుండా —సత్యంతో కూడా చెప్పలేదన్నాడు— వెళ్ళిపోయింది. ఎక్కడికెళ్ళిందో తెలియదు ఆమె వెళ్ళినపుడు తనకు బాగా జ్వరం వుంది. దగ్గు బాగావుంది. క్షయ పెరిగింది.

తెల్లవారి సత్యం రాలేదు. ఇద్దరూ కలిసి వెళ్ళారో? ఎక్కడికెళ్ళారు? ఎందుకెళ్ళారు? తనకేమీ అర్థం కాలేదు. ప్రేమించుకున్నారో తాను నిరాకరించలేదు. ఈ రెండు వారాలలో సత్యం మనసులోని మాట లాగాలని, "పెళ్ళి చేసుకోరా!" అంటే వద్దన్నాడు. సత్యం ఇంటికి రాని ఈ నాలుగు రోజులూ ఎడరి చూస్తూనే వుంటి. సత్యం రావటం లేదు. తాను పక్క పైన నుండి లేవలేదు. పక్కయింటి వాళ్ళు అప్పుడప్పుడూ టీ పోస్తున్నారు.

తానంటే సత్యానికి చాలా ప్రేమ. ఈ జ్వరంతో వున్న తనను ఎలా విడిచిపెట్టి వెళ్ళాడో అర్థం కావటం లేదు. ఈ అమ్మాయి...... ఈ పోలీసులు........ వాడు చేసిన తప్పేమిటి? ఎక్కడికిపోయాడు? —ఏమిటి కధ?

తనకు క్షయ ముదిరింది. ఇంక తాను

జీవించదు. కొన్ని గంటలు మాత్రం జీవించ వచ్చు. అంతే— తన కాలం అయిపో యింది. కొడుకుని చూడకుండానే తాను చచ్చిపోతుందా?

సరిగ్గా సత్యం యింటిపైన పోలీసులు దాడిచేసిన సమయంలో—

ఒక చిన్న పల్లెలో—

ఒక ఇంట్లో—

ఒక గదిలో—

సత్యం ఆలోచిస్తున్నాడు.

తానెంత కాలం ఈ గదిలో వుండాలి?

తన అమ్మ ఆరోగ్యం ఎలా వుందో?

తానెందుకు ఈ వలలో చిక్కుకున్నాడు?

అతనికేమీ అర్థం కావటం లేదు.

సత్యం కళ్ళలో కొన్ని రోజుల నుండి జరిగిన సంఘటనలు వరసగా కదలాడ సాగాయి.

సరిగ్గా ఇరవై రోజుల క్రితం, రాత్రి పది గంటలకి బస్సులో టిక్కెట్లు యిస్తున్నాడు తాను. అప్పటికే బస్సులో జనం బాగా పల్చబడ్డారు. ముందు సీట్లో కూర్చున్న ఒక అమ్మాయి దగ్గరికి వచ్చి "ఎక్కడికి" అన్నాడు. చెప్పింది. టిక్కెట్టు యిచ్చాడు. ఆమె ముఖాన్ని చూస్తే ఎక్కడో చూసినట్టుగా వుంది. తల చుట్టూ మఫ్లర్ చుట్టుకుంది. వులెన్ షర్టు వేసుకుంది. దానిక్రింద ఎర్ర చీర కనిపిస్తూ వుంది.

ఎక్కడో చూశాను.

ఎక్కడా?—

పక్కనే కూర్చుని ఆలోచించాడు,

ఎక్కడా?—

జ్ఞాపక మొచ్చింది.

అవును,

భారతి.

తాను ఐదు సంవత్సరాల క్రితం బి.ఏ. చదువుతున్నపుడు—తన క్లాస్‌మేట్...... అపుడు అకస్మాత్తుగా కాలేజీనుంచి వెళ్ళి పోయింది. చదువు మానేసిందేమో అనుకున్నాడు.

ఇప్పుడు......భారతి

తనను గుర్తిస్తుందా?

"మీరు......" అన్నాడు.

"గుర్తించారా?"

"భారతి"

"మీరు సత్యంకదూ!"

"ఎక్కడికి?"

చెప్పింది.

చాలా సేపు ఏవో విషయాలు మాట్లాడు కున్న తర్వాత భారతి అంది.

"నాకో సహాయం చేయగలరా?"

"చెప్పండి!"

"కారణాలు అడగకూడదు. ఏమీ అడగ కూడదు. ఎవరికీ చెప్పకూడదు. నేను వున్నంత కాలం మీ యింట్లో ఆశ్రయం యివ్వగలరా?" —

ఎందుకలా మాట్లాడుతుందా అర్థం కాలేదు తనకు. కాని ఒప్పుకున్నాడు. ఇంటికి తీసుకొచ్చాడు. తాను పడుకునే గది యిచ్చాడు. అమ్మ "ఎవరూ?" అంది 'గుర్తు' అన్నాడు. భారతి వున్నంతకాలం యింటి నుంచి బయటకు కదల లేదు. ఇంట్లో అమ్మకు సహాయంగా పనిచేసేది. మిగతా టైములో ఆమె గది నుంచి కదిలేది కాదు. ముఖ్యంగా ఎవరైనా యింటికొస్తే పగలంతా గదిలో ఏం చేసేదో అసలు అక్కడ ఆమె లేనట్టే వుండేది.

తన కర్థం కాలేదు కాని— రాసుకునేది, చదువుకునేది అని తాను అనుకునే వాడు. ఒకసారి లైబ్రరీ నుంచి కొన్ని పుస్తకాలు తెప్పించింది. ప్రతి రోజూ వార్తా పత్రిక తెప్పించేది. కొన్ని రాజకీయ పత్రికలు కూడా తెప్పించేది.

ఆమె ఎందుకిలా దాక్కుందో తనకేమీ అర్థం కాలేదు.

సరిగ్గా నాలుగు రోజుల క్రితం—

తన డ్యూటీ ముగించుకొని రాత్రి యింటికొస్తే— అమ్మ జ్వరంతో వుంది భారతి గదిలో లేదు ఆశ్చర్యపోయాడు. మంచం మీద చిన్న లెటర్ వుంది "సత్యం! కృతజ్ఞతలు. పని అయిపోయింది. వెళ్ళిపోతున్నాను"

తనకేమీ అర్థం కాలేదు.

అమ్మకు టాబ్లెట్స్ వేశాడు. కాఫీ కాని పోశాడు. అమ్మ పరిస్థితి ఆందోళనగానే కనిపించింది.

"భారతి చెప్పిపోయిందా?"

"వెళ్ళిపోయిందా?"

"ఆఁ"

అమ్మ కూడా ఇంకేమీ మాట్లాడలేదు.

తెల్లవారిన తర్వాత డ్యూటీకెళ్ళాడు. డ్యూటీ చేసుకొని రాత్రి ఎనిమిది గంటలకు డిపోనుండి బయటకొస్తున్నాడు. పోలీసు వ్యాను వచ్చి తనను ఎక్కించుకొని వెళ్ళిపోయింది. ఎందుకు తీసుకెళ్తున్నారో ఏమో తనకేమీ అర్థం కాలేదు.

పోలీసు స్టేషన్‌లో తనను కూర్చుండబెట్టి చాలా మెత్తగా అడిగారు.

"భారతి ఎటు వెళ్ళింది?"

"భారతి ఎక్కడుంది?"

"భారతికి నీకూ వున్న సంబంధాలేమిటి?"

"భారతిని ఎందుకు దాచావు?"

"భారతీ నువ్వూ ఏయే రాజకీయాలలో పాల్గొనేవారు?"

"నీకు ఏయే రాజకీయాలలో సంబంధముంది?"

'మీరిద్దరూ ఒకే గ్రూపు నక్సలైట్లా?"

అప్పుడు తనకంతా అర్థమయ్యింది. భారతి నక్సలైటు.

జరిగింది చెప్పాడు.

తనకు తెలిసింది చెప్పాడు.

వాళ్ళు నమ్మలేదు.

తిట్టారు...... కొట్టారు...... ఆరాత్రి అంతా చిత్రహింసల పాలు చేశారు.

తనకు అంతకుమించి తెలియదన్నాడు.

రాత్రి అంతా ఒకడు కాకపోతే ఇంకొకడు కొడుతూనే వున్నాడు.

తానేమి చెప్పగలడు?

ఏమీ చెప్పలేదు.

వాళ్ళు నమ్మలేదు

చెప్పకపోతే చంపేస్తామన్నారు

తనకు తెలియనిది ఏమి చెప్పగలడు?

తెలిసినా—

చెప్పేవాడు కాదు.

అంత అసహ్యంగా వుంది. తనకు వాళ్ళపైన.

రాత్రి మూడు గంటలకు పోలీసుస్టేషన్ నుండి బయటకు తెచ్చారు. అప్పటికి ఒళ్ళంతా పుండుగా తయారయింది జీపులో కూర్చుండబెట్టారు. అటు ఇద్దరూ ఇటు ఇద్దరూ పోలీసులు కూర్చున్నారు. మధ్య తాను ముందు యస్సై కూర్చున్నాడు. తన చేతికి సంకెళ్లు వేయలేదు.

జీపు నడుస్తూవుంది.

తన నెక్కడికో తీసుకెళ్తున్నారు.

తనను చంపేస్తారు.

తనను అన్యాయంగా చంపేస్తారు.

అన్యాయానికి తాను బలికావాల్సిందేనా?

కాదు

పారిపోవాలి—

అదే ఆలోచన తనలో!

ఒక రైల్వేగేటు వద్ద జీపు ఆగింది. యస్సై కిందికి దిగాడు. ఒక పోలీసును సిగరెట్లు తెమ్మని పంపాడు.

తన వక్క పోలీసు లేడు.

అకస్మాత్తుగా లైట్లు పోయాయి.

అంతా చీకటి......

తాను జీపులో నుంచి దూకేశాడు.

పరుగు......... పరుగు.........

వెనుక బూతులు...... బూట్ల చప్పుడు... తాను పరుగెత్తుతున్నాడు, సందులు గొందులు తిరిగి... కిందపడీ, లేచీ...... మొత్తం మీద వాళ్ళనుంచి తప్పించుకున్నాడు.

నగరం పొలిమేరలు దాటి పొలాలలో పడి పరుగెత్తి, పరుగెత్తి ఇపుడు తానున్న పల్లెకు చేరాడు. ఏం చేయాలో తనకు అర్థంకాలేదు. ఇలా బహిరంగంగా నిల్చోవటం ప్రమాదం. ఈ పల్లెకు ఎప్పుడో తాను వచ్చాడనే ఆలోచన రాగానే— ఈ పల్లెలో టీచర్ స్నేహితుడున్నాడని జ్ఞాపకం వచ్చింది. అప్పటికే తెల్లవారింది. తనకు భయం...... పోలీసులు తన వెనుక రావచ్చు.

టీచర్ ఇల్లు తెలును కాని— ఆయనకు నిద్ర లేపి—జరిగిందంతా చెప్పాడు. టీచర్ ఒక గది ఇచ్చి ఆ గదిలో దాక్కోమన్నాడు.

ఆ గదే ఈ గది మూడు రోజులయ్యింది.

ఎటూ కదలటం లేదు.

ఎన్నిరోజులు ఇలా వుండగలడు?—

అమ్మ ఎలా వుందో?—

భారతి ఎంత పని చేసింది?

చితి కాలుతూ వుంది.

శవం కాలుతూ వుంది.

రాత్రి పన్నెండు గంటల సమయం

ఆ మంటల ముందు సత్యం

పక్కనున్న కట్టెల నొకటొకటి అందులో వేస్తున్నాడు.

సత్యం తల్లి పోలీసులు దాడి చేసిన ఆ రాత్రి చచ్చిపోయింది.

వాడలోని వాళ్ళు ఆమెను దహనం చేశారు. నాలుగు గంటలకు ఈ వార్త సత్యానికి తెలిసింది. కాని పోలీసువాళ్ళు అరెస్టు చేయవచ్చని టీచర్ మిత్రుడు హెచ్చరిస్తే, అప్పుడు రాలేదు. రాత్రి పది దాటాక చితి వద్ద కొచ్చాడు.

అప్పటికే మంటలు చల్లారాయి.

అగ్ని మెరుస్తూ వుంది

పైన వెన్నెల కురుస్తూ వుంది

సత్యం కొంతసేపు ఏడ్చాడు

తరువాత—

కొన్ని ఎండుపుల్లలు ఏరి మళ్ళీ మంట రగిల్చాడు.

మంట ముందు సత్యం.

అమ్మ వెళ్ళిపోయింది.

తాను ఏకాకి అయ్యాడు

ఇక ఏమీ ఆలోచించటం లేదు.

గంటలు గడుస్తున్నాయి

తెల్లవారే ముందు—

భుజం మీద పడిన చేతిని చూసి తల తిప్పిచూశాడు— భారతి!

చాలా సేపు ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు. "నా మూలంగా చాలా నష్టపోయావు సత్యం" ఏమీ మాట్లాడలేదు సత్యం.

"నీకింత నష్టం నా మూలంగానే జరిగింది"— సత్యం నోరు విప్పటం లేదు.

"పద సత్యం నన్ను పోలీసు స్టేషన్‌లో అప్పగించు. లేకపోతే నీవు స్వేచ్ఛగా తిరగటానికి వీలుండదు"

"పద సత్యం నన్ను పోలీసు స్టేషన్‌లో అప్పగించు"

"నాకిష్టం లేదు"

"నేను వెళ్తున్నాను"

"నేనూ వస్తున్నాను"

"ఎక్కడికి?"

"నీ దారి లోకి"

ఆశ్చర్యపోయింది భారతి.

"నా దారి నిండా ముళ్ళూ రాళ్ళూ చీకటీ వుంటాయి సత్యం!"

"ఫర్వాలేదు. జనం దారిలో మొదట ముళ్ళే కానీ పూలుండవని నాకు తెలుసు"

సూర్యుడు తూర్పున ఉదయిస్తున్నాడు.